హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ ప్రియాంక

చింతలపాలెం, జనవరి 20 : హరిత హారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను, పులిచింతల ప్రాజెక్ట్ కాలనీలోని నర్సరీలను, మెగా పల్లె ప్రకృతి వనాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. నర్సరీలోని మొక్కలను గుర్తించేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్తమద్ది వెంకట్‌రెడ్డి, తాసిల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ జగదీశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి షేక్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలి

• ఏపీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ సీఐడీ అధికారి సరిత

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ సీఐడీ అధికారి సరిత

కోదాడ టౌన్, జనవరి 20 : విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని ఏపీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ సీఐడీ అధికారి సరిత (ఐపీఎస్) అన్నారు. శనివారం పట్టణంలోని న్యూ విజన్ స్కూల్ పథమ వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. సామాన్య విద్యార్థులకు చక్కని బోధనతో పాటు అన్ని వసతులు కల్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలువాలన్నారు. బాల్యంలో నేర్పిన ఆట, పాటలు జీవితాన్ని మలుపు తిప్పుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని అలరించాయి. పాఠశాల చైర్మన్ సీహెచ్‌జికె. ప్రసాద్, డైరెక్టర్ కార్తీక్, ఎస్ఆర్ఎం స్కూల్స్ గ్రూప్ అధినేత శ్రీదేవి, డైరెక్టర్ గోపిచంద్, ఎంఈఓ సలీం షరీఫ్ పాల్గొన్నారు.

కుల గణన తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

• బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంప్రభు

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంప్రభు

నూతనకల్, జనవరి 20 : జనాభా లెక్కల్లో కుల గణన చేపట్టిన తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కుల గణన చేపడుతామని చెప్పిన మాటకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలన్నారు. కుల గణన చేపట్టి అన్ని కులాలకు న్యాయం జరిగేలా రాజకీయంగా అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బ్రాహ్మండ్లపల్లి భవానీశంకర్, బోల్క కొమురయ్య, బ్రాహ్మండ్లపల్లి మధు, ఉప్పుల లింగరాజు, చామకూరి రమేశ్, గురులింగం, బోల్క మల్లయ్య, నవీన్, సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్

గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వాణిశ్రీకాంత్‌రాజ్

నాగారం/మోత్కూరు, జనవరి 20 : ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ వాణిశ్రీకాంత్‌రాజుకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి దియునైటెడ్ థియాలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ న్యూయార్క్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్ బేగంపేటలో గల మారిగోల్డ్ హోటల్‌లో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ జనరల్ ఆఫ్ టర్కియాల్మన్ అర్ఖాన్ ఒకాన్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక

తిరుమలగిరి, జనవరి 20 : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో ఈ నెల 29 జరిగే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ వేముల బాలరాజు పాఠశాల నోటీస్ బోర్డు నందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20న ఓటరు జాబితా, 22న అభ్యంతరాల స్వీకరణ, 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యాజమాన్య కమిటీ ఎన్నిక నిర్వహించటం జరుగుతుందని చెప్పారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరై పాఠశాల యాజమాన్య కమిటీని ఎన్నుకోవాలని ఆయన కోరారు.

నడిగూడెం : మండలంలోని తెల్లబెల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్యం కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్.భిక్షం సీఆర్పీ నందిగామ రామారావు, సభ్యులు నాగరాజు, సైదులు, వీరయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-AI

PLOT FOR SALE
★చౌటుప్పల్ మండలంలోని చిన్నకొండూరు గ్రామంలో 340 Sq.yards, East Facing ప్లాట్ అమ్మబడును. గ్రామపంచాయతీ ధృవీకరణ ఉంది. కావలసినవారు సంప్ర: సి.హెచ్. ఫణికుమార్ రెడ్డి, ఫోన్: 9573755622 / 9959055622.
NT-314396

EDUCATION
★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-AII

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-AI

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ
నల్లగొండ : 9182777626
సూర్యాపేట : 9182777059
మిర్యాలగూడ : 9182777059
నల్లగొండ : 9182777635
దేవరకొండ : 9182777635

అభివృద్ధి ప్రణాళికలపై దృష్టి సారించాలి : జడ్పీ సీఈఓ సురేశ్

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ సురేశ్

పెన్‌పహాడ్, జనవరి 20 : 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, అలాగే మండల అభివృద్ధి ప్రణాళికలు పకడ్బందిగా తయారు చేయాలని జడ్పీ సీఈఓ సురేశ్ సంబంధిత అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల, గ్రామ స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకునేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ నెలాఖరు వరకు అభివృద్ధి ప్రణాళికలు పూర్తి చేసి సదరు గ్రామ పంచాయతీ వారీగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ప్రణాళికలు పూర్తి చేసినపుడే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కానున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

• ఎంపీపీ స్నేహలత

తిరుమలగిరి, జనవరి 20 : గ్రామాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో అధికారులు భాగస్వాములై ప్రజా సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలని ఎంపీపీ స్నేహలత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో డెవలప్‌మెంట్ ప్లాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో చేపట్టే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మాధవరెడ్డి, ఎంపీడీఓ ఉమేశ్‌చారి, తాసీల్దార్ రమణారెడ్డి, ఎంపీఓ మారయ్య పాల్గొన్నారు.

రత్నవరంలో వైద్య శిబిరం

నడిగూడెం, జనవరి 20 : మండలంలోని రత్నవరం గ్రామంలో శనివారం లేబర్ కార్డు ఉన్న కార్మికులకు సీఎస్సీ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పగడాల పద్మాప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పగడాల భూపాల్‌రెడ్డి, కారంశెట్టి శ్రీనివాస్‌రావు, బీజేపీ మండలాధ్యక్షుడు దున్న సతీశ్, చల్లా తారక్, రాకేశ్, శ్రీనివాస్, మేకల నాగరాజు, బండారు శోభారాణి, పరబ్రహ్మచారి, బాలకృష్ణ పాల్గొన్నారు.

'హామీలను నెరవేర్చాలి'

నడిగూడెం, జనవరి 20 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేపీ మండలాధ్యక్షుడు దున్న సతీశ్ అన్నారు. శనివారం మండలంలోని వల్లాపురంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేకల నాగరాజు, బండారు శోభారాణి, గురువయ్య, పరబ్రహ్మచారి, పాపయ్య, వీరయ్య, నాగమణి, సైదిరెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

రెయిన్ సిమెంట్స్ ప్లాంట్ విస్తరణకు ఓకే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, పక్కన అదనపు కలెక్టర్ ప్రియాంక

మేళ్లచెర్వు, జనవరి 20 : మేళ్లచెర్వు మండలం రామాపురం రెయిన్ సిమెంట్స్ క్లింకర్ ఉత్పత్తి సామర్థ్య పెంపుదలకు శనివారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత క్లింకర్ సామర్థ్యం పెంపుదలకు అభిప్రాయ సేకరణ జరిపారు. ఈ సందర్భంగా 15 మంది తమ అభిప్రాయాలను ప్రత్యక్షంగా తెలుపగా, 83 మంది ఆన్‌లైన్ ద్వారా, 4 మంది లిఖిత పూర్వకంగా అభిప్రాయాలను వెలిబుచ్చారు. సిమెంట్ ఉత్పత్తి పెంపుదల ప్రతిపాదనలపై ప్రత్యక్షంగా 16 మంది, 77 మంది ఆన్‌లైన్ ద్వారా, 12 మంది లిఖిత పూర్వకంగా అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం విద్యుత్ ఉత్పత్తి పెంపుదలపై 25 మంది ప్రత్యక్షంగా, 75 మంది ఆన్‌లైన్ ద్వారా, 20 మంది లిఖిత పూర్వకంగా తమ స్పందనను వ్యక్తపరిచారు. వారిలో మెజార్టీ మంది పై విషయాలకు అనుకూలంగా మాట్లాడారు. కాగా ఈ ప్రాంత వాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దవాఖానలో మౌలిక వసతులను పెంచాలని, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాలని, ఇంటర్ వరకు ఉచిత విద్యను అందించాలని పరిశ్రమ యాజమాన్యాన్ని వారు కోరారు. కలెక్టర్ వెంకట్రావ్ మాట్లాడుతూ.. పరిశ్రమ యాజమాన్యం స్థానికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేశ్‌బాబు, ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు, సర్పంచ్ మల్లిఖార్జునరావు, మాజీ ఎంపీపీ పాలేటి రామారావు, మాజీ సర్పంచ్ సూరిశెట్టి బసవయ్య పాల్గొన్నారు.

కల్తీ కలుపు మందు పిచికారీతో ఎండిన వరి పైరు

• 12 ఎకరాల్లో పంట నష్టం

ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ జానీమియా

సూర్యాపేట రూరల్, జనవరి 20 : సూర్యాపేట మున్సిపల్ పరిధి రాయిన్‌గూడెం గ్రామంలో రైతు కొణతం కరుణాకర్‌రెడ్డి సాగు చేస్తున్న వరి పైరు 12 ఎకరాల్లో ఎండిపోయింది. అందుకు కల్తీ కలుపు మందు పిచికారీయే కారణమని ఆయన ఆరోపించారు. కరుణాకర్‌రెడ్డి తనకున్న 6 ఎకరాలతో పాటు మరో 6 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాడు. హుజూర్‌నగర్ నుంచి కలుపు మందులు తీసుకువచ్చి 12 ఎకరాలకు పిచికారీ చేశాడు. కలుపు మందు పిచికారి చేసిన నాటి నుంచి 8 రోజులకు వరి పొలం మొత్తం ఎండిపోయింది. కల్తీ కలుపు మందు వల్లే ఇలా జరిగిందని, సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. విషయాన్ని వ్యవసాయాధికారులకు తెలుపగా ఏఓ జానీమియా శనివారం వరి పొలాన్ని పరిశీలించారు. రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల వీరమల్లు యాదవ్, ముత్యాల సైదులు, ముత్యాల పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

• తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

క్యాంపెయిన్‌ను పరిశీలిస్తున్న తాసీల్దార్

నూతనకల్, జనవరి 20 : 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ శ్రీధర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రోడ్డు పక్కన ప్రమాదంగా ఉన్న గుంత

మేళ్లచెర్వు, జనవరి 20 : మండల కేంద్రంలోని నెహ్రూ బజార్ సమీపంలో ఎన్ఎస్‌పీ కాల్వ పక్కన ఉన్న గుంత ప్రమాదకరంగా ఉన్నది. ఈ ప్రాంతంలో రాకపోకలకు వీలుగా ఎన్ఎస్‌పీ కాల్వ మీద ఓ వంతెనను నిర్మించారు. ఈ మార్గంలో సిమెంట్ పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆలయాలకు వెళ్లే వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు ప్రక్కన ఉన్న గుంత కనిపించక రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను వెంటనే పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి

• సీపీఐ నాయకులు

కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బొడ్రాయిబజార్, జనవరి 20 : సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు పడకల గదుల ఇండ్లను నిజమైన లబ్ధిదారులకు పంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎంపికైన లబ్ధిదారులకు పట్టాలు పంచారే తప్పా ఇప్పటికీ వారికి ఇండ్లను కేటాయించలేదని తెలిపారు. ఇంకా పూర్తికాని వాటిని త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, మురగుండ్ల లక్ష్మయ్య, నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

• ఎంపీపీ రేణుక

గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ రేణుక

అర్వపల్లి, జనవరి 20 : గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. మండలంలోని కుంచమర్తి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రాలింగరాజు, కార్యదర్శి నవీన్‌రెడ్డి, చరణ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

• ఎంవీఐ బాబు

కోదాడ రూరల్, జనవరి 20 : వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని కోదాడ ఎంవీఐ రాజకొండ బాబు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం కోదాడ కార్యాలయంలో విద్యార్థులు, వాహనదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మత రాజకీయాలను తిప్పి కొట్టాలి

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు

బొడ్రాయిబజార్, జనవరి 20 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ, ఐఎన్‌టీయూ, ఇఫ్టూ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకా పూర్తికాని అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ చేయడం సరికాదని పెద్ద పెద్ద పీఠాధిపతులు సూచించినా పట్టించుకోకుండా పార్లమెంట్ ఎన్నికల ముందే కార్యక్రమాన్ని తీసుకున్నదని విమర్శించారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు రెబల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

• తాసీల్దార్ ప్రకాశ్‌రావు

మోతె, జనవరి 20 : ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో కోల రవి డొంకని ఆక్రమించారని తెలుసుకుని అట్టి భూమిని పరిశీలించారు. ఆక్రమణను నిర్ధారించి భూమిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ట్రిబ్యునల్ స్టేతో ఆగిన అవిశ్వాస తీర్మాన సభ

నడిగూడెం, జనవరి 20 : మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోఆపరేటివ్ ట్రిబ్యునల్ స్టేతో శనివారం ఆగింది. ఇటీవల 13 మంది డైరెక్టర్ల గాను 10 మంది డైరెక్టర్లు చైర్మన్‌పై ఈ 27న సూర్యాపేట సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. దాంతో 20న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తూ డైరెక్టర్లకు డీసీఓ నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై చైర్మన్ పుట్టా రమేశ్ కో ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి స్టే తీసుకురావడంతో శనివారం జరుగాల్సిన సమావేశం ఆగిందని సీఈఓ ఎలమంద రావు తెలిపారు.

కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు ఏరువాక ఫౌండేషన్ అవార్డు

గరిడేపల్లి, జనవరి 20 : గడ్డిపల్లి కేవీకే మృత్తికా శాస్త్రవేత్త అరిగెల కిరణ్‌ను 2023-24 ఏడాదిగాను ఏరువాక ఫౌండేషన్ అవార్డు వరించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష కృషి చేసినందుకు గాను ఈ అవార్డు లభించింది. శనివారం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ మల్లారెడ్డి యూనివర్సిటీ, హైదరాబాద్ నందు పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గార రాఘవరావు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

అన్నదానం

కోదాడటౌన్, జనవరి 20 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం అన్నదానం నిర్వహించారు. కోదాడ కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, పారిశ్రామికవేత్త నీలా సత్యనారాయణ, ట్రాఫిక్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు నాగుబండి రంగా, అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాస్‌రావు, యాద సుధాకర్, రాయపూడి వెంకటనారాయణ, సాంబశివరావు, బండారు శ్రీనివాస్‌రావు, సాయి, రామారావు, ప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏడీఏ వాసు

మునగాల, జనవరి 20 : వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ వాసు అన్నారు. శనివారం మునగాల మండల కేంద్రంలో వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతిని గమనించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అధికారుల సూచనలు పాటించి లాభాలు సాధించాలని పేర్కొన్నారు.

నేడు మఠంపల్లిలో మంత్రి ఉత్తమ్ పర్యటన

మఠంపల్లి, జనవరి 20 : నేడు మఠంపల్లి మండల కేంద్రానికి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రానున్నట్లు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాల్వపల్లి, కొత్త తండా, లాలితండాలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు వెల్లడించారు.

30న చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

నేరేడుచర్ల, జనవరి 20 : నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ అనంతు శ్రీనివాస్‌పై ఈ నెల 30న అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించాలని జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్‌బాబు ఉత్వర్వులు జారీ చేశారు. సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా ఇటీవల ఒకటవ వార్డు డైరెక్టర్ కొండ పిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో 12 మంది డైరెక్టర్లు ఉండగా 10 మంది డైరెక్టర్లు ఈ నెల 8న చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టాలని తీర్మానం చేసుకుని జిల్లా కలెక్టర్‌కు, జిల్లా సహకార సంఘం అధికారికి దరఖాస్తు చేశారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్‌బాబు 30న అవిశ్వాస సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

కోదాడ రూరల్, జనవరి 20 : తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దొరకుంటలో శనివారం జరిగింది. రూరల్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లా నరసింహారావు పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ (19) ఇంజినీరింగ్ చదువుతున్నాడు. చదువు విషయమై తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పాలకవీడు, జనవరి 20 : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో శనివారం లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పాపగంటి దేవదానం (50) అనే వ్యక్తి గ్రామంలోని రైతు వేదిక నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో జాన్‌పహాడ్ నుంచి నేరేడుచర్ల వైపు వెళ్తున్న టీఎస్ 28,టీ0459 నంబర్ గల ఖాళీ యాష్ ట్యాంకర్ అతివేగంగా వచ్చి దేవదానాన్ని ఢీకొట్టడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. దేవదానంకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డీసీఎంలో ఆవుల తరలింపు పట్టివేత

కోదాడ రూరల్, జనవరి 20 : అక్రమంగా రెండు డీసీఎం కంటైనర్లలో తరలిస్తున్న 77 ఆవులను రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్ర నుంచి ఆవులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మండల పరిధి నల్లబండగూడెం శివారు రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్ రోడ్డు వద్ద పట్టుకుని లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కి కొక్కిరేణి పాఠశాల విద్యార్థి

మునగాల, జనవరి 20 : రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు మండలంలోని కొక్కిరేణి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి వాసా నిఖిల్ (9వ తరగతి) ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం యాకూబ్ అలీ, గైడ్ టీచర్ మధు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి ప్రతిభ సాధించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ విజేతలు 'తేజ' విద్యార్థులు

కోదాడ రూరల్, జనవరి 20 : హైదరాబాద్ కోఠిలోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శనివారం హెచ్‌డీఎఫ్ బ్యాంక్ సారథ్యంలో గ్రేక్యాప్స్ సంస్థ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలో కోదాడ పట్టణ పరిధి కోమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు దేవరపల్లి సునందవర్ధన్‌రెడ్డి, నోముల సృజన్ గుప్తా జట్టు ప్రథమ స్థానం సాధించిన్నట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. విజేతలకు బ్యాంక్ రీజినల్ బిజినెస్ హెడ్ సిద్ధార్థ చటర్జీ రూ.50 వేల చెక్కు అందించారు.

'దక్కన్'లో వైద్య శిబిరం

పాలకవీడు, జనవరి 20 : మండలంలోని భవానీపురంలో గల దక్కన్ ఫ్యాక్టరీ నందు శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రాజు, సీజీఎం నాగమల్లేశ్వర్‌రావు తెలిపారు. మ్యాక్స్‌కేర్ హాస్పిటల్, మిర్యాలగూడ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రావిపహాడ్, మహంకాళీగూడెం, శూన్యపహాడ్, చెర్వుతండా, కొత్తతండా గ్రామాలకు చెందిన 400 మందికి కంటి పరీక్షలు, ఎముకల వ్యాధి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు.